# బండరాళ్లు

౧

బండరాళ్ల బ్రతుకులన్నీ
ఎండిపోవు కాల్వదరిని
మండిరాలు బూదియడవి
లెండన్నను లేవ నెవరు
రండన్నను రా నెవరో

అని పాడుకుంటూ భోనగిరి రెడ్డి కొండపక్క అడివిలో వాగుపక్క బండరాతిమీదను కూర్చున్నాడు. అతడు కమ్యూనిస్టూ కాదు, కాంగ్రెసువాదీ కాదు. అతడు తెలంగాణా వీరుడు.

తెలుగుతల్లీ! చెట్లతో జొంపాలతో
నిండిపోయిన పచ్చని కొండలుగలదానా!

ఆకాశానికంటే ఒకటి రెండు బండరాళ్ళను కలిగి ఉన్న గుట్టలుగలదానా! జీవనదులు, ఎండిపోయినవాగులూ ప్రవహించేదానా! కాకైనా చొరరాని కారడవులుగల దానా! సర్వలోహాలు, నవరత్నాలు, కారునలుపు రాక్షసి బొగ్గూ గర్భంలో దాచుకొన్నదానా! తెలుగుతల్లీ! మహోత్తమదేవీ! అమృత వాక్కులదానా! ఆనందపూర్ణ శిల్పజీవీ! దివ్యసాహిత్యపదురాలా! బానిసత్వంలో క్రుంగిపోతూ స్వేచ్ఛకై వెతలు చెందేదానా! వేదనలు హారాలుగా ధరించినతల్లీ! అవమానాలు కిరీటంగా శృంగారించుకొన్నదేవీ! నీవు బౌద్ధభిక్కునివా? — జైనసన్యాసినివా?

సౌందర్యపూర్ణయౌవనాంగివా? నీగుళ్లు కూల్చబడి, నీ గోపురాలు తూల్చబడి, నీశిల్పాలు ఖండింపబడి, నీ సాహిత్యాలు మండింపబడి, సౌష్ఠవపూర్ణమైన నీ బంగారు అంగాలు ఔషధాలకు లొంగని గాయాలుపడి, నువ్వు మాయమాటలకు లొంగిపోయి, నువ్వు వేషమే మార్చుకొని స్వచ్ఛకాంతీయత ప్రజ్వలితమైన నీసౌందర్యము బురఖాలో ముసుగుపడిపోయి, నీ బిడ్డలు పరభాషలకు, పరవేషాలకు సలాములుపెట్టి, ఎన్ని సంవత్సరాలు ఎన్ని శతాబ్దాలు —

ఈనాటికి మా ఆవేదన ఈ రజాకారుయుద్ధంగా పరిణమించి, తల్లీ ఈచేతి కొక ఖడ్గాన్ని ప్రసాదించు!

మాతా ఈ కంఠానికొక ఉరుమును అందించు!

సహోదరీ ఈహృదయానికొక ధైర్యం కవచంచేయి!

వీరపత్నీ! సుమంగలీ! తెలుగుతల్లీ! నాచూపులలో చండభాను తైక్ష్ణ్యకాంతులు ప్రసాదించు!

నా పెదవులకు ఆనంద హాసనృత్యము మాయం చేయించు! నేడు తెలుగుజాతి నశించడమో, నిజమైన స్వాతంత్ర్యపథంలో విహరించడమో!

అని హృదయంలో అనుకొంటూ భోనగిరిరెడ్డి కళ్ళవెంట దొనదొన నీళ్లు కార్చినాడు.

## 2

తెలంగాణ వీరుడా! భోనగిరిరెడ్డీ! నీ కళ్ళయెదట నీ చెల్లెలికి మానభంగమైనది. ఆమె నూతిలోపడి చచ్చిపోయినది. నీ భార్య మానభంగంకాకుండా తన హృదయ రక్తం జిమ్ముమని చిమ్మగా పొడుచుకొని నేలవాలింది.

నీకు దేశంవదలి తక్కిన ఆంధ్రసీమలకు పారిపోవడం ఇష్టం లేకపోయింది. నీగ్రామం తగులబడిపోయినా, నీ పంటలు మంటగలిసినా, నీవాళ్ల బ్రతుకులు కూలిపోయినా, అటు గాంధీజీమాటో, ఇటు నీనాయకుల గర్జనో ధైర్య సాహసాలై ఈ అడవుల్లో, ఈ బండరాళ్ల మధ్య ఈ ఎండిపోయిన సెలఏళ్ల ఇసుకలలో నిలుపుకొన్నవి.

రజాకార్లను ఎదిరించినావో, రాక్షసులను హతమార్చినావో, సహధర్మచారిణిని పోగొట్టుకొన్న ఒంటి సింహానివై పొదలలో, గుట్టలలో కదులాడుతూ, విదిలించిన కేసరిలా నడిరేయిని విరోధి శిబిరాలు దద్దరిల్లేటట్లు గర్జన చేస్తూ నిలుచుండినావు.

## 3

భోనగిరిరెడ్డికి సహాయంగా భారతీయసేనలు పోలీసు యాక్షనుచేస్తూ వేంచేశాయి.

మూడురోజుల పట్టపగలులో 200 ఏళ్లు వృద్ధిపొందిన ఆసఫ్జాహి దౌర్జన్యం అంతరించిపోయింది. అమ్మ పెట్టవలసిన నాలుగూ పెడితే అబ్బాయికి బుద్ధివచ్చింది.

భారతీయ హిందూజాతి హృదయంలో కక్షులు పెట్టు

కునే జాతికాదు. ముస్లిం సహోదరుల హృదయం ఉద్రిక్తత పొంగుచల్లారింది. వారి దౌర్జన్యాలకు వారే సిగ్గుపడిపోయినారు.

భారతీయ సైన్యపుబందూకు మీదనుండి తెలంగాణా హిందూముస్లిం సహోదరులు చేయిచేయి పట్టుకొని "ఆదాబ్ అరజ్ — నమస్కారము" అనుకున్నారు కాని భోనగిరిరెడ్డి ఒంటరితనం పోలేదు.

ఓ భోనగిరిరెడ్డీ ఇటు కమ్యూనిస్టులు నీవు ఎరగని, ఊహించలేని నాశనపూరితమైన దౌర్జన్యాన్ని రేకెత్తించి తెలుగునాడును దగ్ధపటలం చేస్తారేమోనన్న భయమూ ఆవరించింది.

అటు కాంగ్రెసు బురఖా తగిలించుకొన్న దొంగలు, దోపిడీగాండ్రూ, దేశముఖులు, కౌలుదార్లు ఈ నలుగురూ పూజ్యుడైన బాపూజీ పవిత్ర సత్యవ్రతాన్ని హింసకు ఎర జేసి తెలుగునాటి ప్రజల బ్రతుకులను ఎడారిముంచేస్తారేమోనన్న అనుమానమూ కలిగింది.

ఒంటివాడవై నీ ఇంటికిపోతే ఇంటిలో మసలిన సహధర్మచారిణి లేదు. నీయిల్లే మంటగలిసిపోయింది. నీభూములు ఇతరులాక్రమించి, నీ పశువులు పచనముగావింపబడి, నీ నాగలి ద్వేషపుభోగిమంటలోకలిసి, నువ్వు ఒంటివాడవై నిట్టూరుస్తూ నీకు ఆశ్రయం ఇచ్చిన ఆ బండరాళ్లమధ్యకే మళ్లీ వచ్చి నిలుచున్నావు.

నీఆస్తి తెలంగాణాకు పాతగొంగళి, నీపాస్తి అడవుల లోని సీతాఫలపు పళ్లు!

౪

ఒకరోజున భోనగిరిరెడ్డి తాను అడవుల్లో సంపాదించుకున్న ఆ పిదపకాలంనాటి సీతాఫలపుపళ్లూ, కట్టెడు మోదుగాకు వరంగల్లు బజారుకువెళ్ళి అమ్ముకొని నల్లబజారులో సేకరించిన ఇన్ని జొన్నలు, ఇంత ఉప్పూ కారం పట్టుకొని ఆ ఒంటిమిట్టకు 15 మైళ్ళ దూరంలోవున్న తన మూడుమిట్టల స్వగ్రామానికి వచ్చాడు.

స్వగ్రామం అంటే ఆతని వెనకటిగ్రామంకాదు. తాను ఒంటిగా నివసించిన ఆకొండపక్క బండరాళ్ళే ఆతని స్వగ్రామం. అక్కడే ఆతడొక చిన్నగుడిసె వేసుకున్నాడు. ఏటిలోకి ప్రవహించివచ్చే చిన్న సన్ననిఊటకు అడ్డంకట్టి, చిట్టిగుంట నిర్మించుకొని ఆ నీటితో తడుపుకుంటూ ఆ బండరాళ్ళ దత్తుకొడుకు భోనగిరిరెడ్డి వ్యవసాయం చేస్తున్నాడు.

ఒకటి రెండు కూరగాయలైతే వరంగల్లుపోయి అమ్ముకునేవాడు. ఆతని కడుపుకింత అన్నంపెట్టిన తల్లులు సీతాఫలపుపళ్లు, మోదుగాకు. అవి అమ్మగా వచ్చిన డబ్బులు ఆతని రొట్టెకు జొన్నపిండిఇచ్చాయి. రుచికి ఉప్పూ కారాలిచ్చాయి. ఆ అడవిలోనేవున్న ఇన్ని చింతకాయలేరి తొక్కు చేసుకున్నాడు.

ఆనాడు సాయంత్రమింటికి చేరుకుంటూవుంటే దూరంగా తన ఇంటిదగ్గర ఏదో చిన్నమంట కనిపించింది. అమ్మయ్యో! యింకా తనబ్రతుకులో కష్టాల మొయిళ్ళు చెదరిపోయి ఆకసము తేటపడలేదా అనుకున్నాడు. అనుకుంటూ

ఒగర్చుకుంటూ ఒక్కపరుగులో ఇంటిదగ్గర వాలాడు. ఇంటి కెదురుగుండా మూడురాళ్లు పొయ్యిగాపెట్టి ఒక స్త్రీ రొట్టె కాలుస్తోంది. అతడు తెల్లబోయి ఆలాగే నిలుచుండి ఎవరు నువ్వు అని అడిగినాడు.

ఎవర్ని నేను? ఆమె బదులుచెప్పినది.

"ఇక్కడ యేమి చేస్తుంటివి?"

'రొట్టెకాలుస్తున్నా అయ్యా! నీబాంచను. కాలు మొక్కతా.'

'రొట్టెకు పిండిఎక్కడిది, ఈకుండ మూకుడు ఎక్కడిది?'

"ఈ గుడిసెలోవుంటే పట్టుకొచ్చినాను తెలియక. పిండి ఆ చిల్లుకుండలోవుంటే తడిపి రొట్టెకాలుస్తున్నాను."

"ఇదేమిటి? అసలు నువ్వెవరంటే?"

"నేనెవర్నని చెప్పను అయ్యా? నేనెవర్నో! నాకు యాదుండేది? నామగణ్ణి చంపినారు. నన్ను చెరిచినారు. బాదినారు. నేను పెయి తెలియక పడిపోయి, కండ్లు తెరిచే తలికి మావూరు మండిపోబట్టింది. నేను చావక మిగిలినా. నావూరు నాకు యాదిలేదు. ఏదో తెరచాటు. ఈ వూరూ ఆ వూరూ బిచ్చమడిగి, ఈ కాయతిని ఆ నీరుత్రాగి ఈడకు వచ్చినా. నీ బాంచను. కాలుమొక్కతా!"

భోనగిరిరెడ్డి చెట్టుమోడులా అలానిలుచుండి పోయి నాడు. అతని కళ్ళవెంట దొనదొన బాష్పబిందువులు దిగి కారిపోయినాయి.

రజాకార్ల రాకాసిరాజ్యం పోయింది. ఇండియా

యూనియన్ బందూకుపైనుండి హిందూ ముస్లిములు చేయి చేయి కలుపుకున్నారు.

ఓ తెలుగునాటి స్త్రీ! నీహృదయంలో మాయరాని గాయాలు తగిలినవా? నీబ్రతుకు ఖండఖండాలుగా గొడ్డలి వ్రేటుపాలై దుమ్ములో రాలిపోయిందా?

భోనగిరి రెడ్డి హృదయంలో ఆస్త్రీ చిన్న బిడ్డలా దర్శనమిచ్చింది. ఏకాకిగా ఎవరూ లేని ఎడారిలో ఎలుగెత్తి ఏడ్చే పసిపాపలా కనిపించింది. తన్ను చూచి నిల్చున్న ఆ స్త్రీని పైకిఉబికి రాలేని వెక్కి వెక్కి ఏడ్పుతో ఆతడు తన హృదయానికి గాఢంగా అదుముకున్నాడు.

"ఓ ఆడదానా! తల్లీ తండ్రీ భర్తా బిడ్డా చుట్టమూ దైవమూ లేని ఓ తెలుగునాటి ఆడదానా! ఈబండరాళ్ళ మధ్య ఈ కొండపక్క ఈ ఎండిపోయిన వాగుదరిని ఈ గుడిసెలో అన్నీమరచి ఒళ్ళుతెలియక నిదురపో. ఒక కొత్తపొద్దులో కళ్లుతెరిచి కొత్తరంగులు చూచి ఆనందించు. కొత్త సుగంధాలు వాసనచూస్తూ మైమరచిపో" అన్నాడు.

ః

భోనగిరిరెడ్డి పేరులేని ఆ తెలుగునాటి స్త్రీకి ఒరంగలు బజారులో దొరికిన ఒక ముతకచీర ఒక ముతకరైక కొనుక్కు వచ్చాడు. అంతయుద్ధంలోనూ ఆతనిచేతిని దండకడియాలు పోలేదు. అవి అమ్మి బండరాళ్ళమధ్య నిలుచున్న ఒంటి వాడైన తన గుడిసె ప్రాంగణానికి దిక్కు తెలియక తన్నుమరచి నడిచివచ్చిన ఆ తెలుగునాటి స్త్రీకి కొనుక్కు వచ్చినాడు.

ఆచీర అప్పుడే వికసిస్తున్న మోదుగుపువ్వుల ఎరుపు చీర.

ఆరైక ఆనాటి నిర్మలాకాశపు నీలి రైక. దాని అంచులు చివుళ్లు తొడిగి యవ్వనంతాల్చే ఇప్పచెట్టు పచ్చని ఆకురంగు.

ఆబండరాళ్ళలో నవ్యాశామూర్తియైన భోనగిరిరెడ్డి, నవ్యశక్తి స్వరూపిణియైన ఆ తెలుగునాటి స్త్రీ ఈ సంక్రాంతి ఉదయంలో ఒకమాత్నయుగ ప్రవేశం గమనిస్తూ నిలుచున్నారు.

రెండు వందల సంవత్సరాలనాటి కాలము వెనకవేసుకొని నూత్న సౌందర్యము అలంకరించుకొన్న ఓ తెలుగునాటి స్త్రీ ఎండిపోయిన నీ దేహసౌష్టవ సౌందర్యము నూతనార్ద్రిత సముపార్జించుకొని నీ కాలిముందర సెలయేరు కొత్తనీటి ప్రవాహాలనిండి నీ తెలుగునాడు ఇటు తూర్పు తీరము అటు మంజీరతీరాలుదాటి నీ తెలుగురెడ్డి బ్రతుకును పాలసముద్రము చేస్తుందా?

కొండవాగుపక్కన బండరాళ్ళు, పూరిగుడిసె పక్కన మెడదపొంగి అంచులు చాపుకుంటూ కిలకిల మనే భోనగిరిరెడ్డి సాగుచేసినపొలం.

కొండపక్క అడవిలో వాగుపక్క బండరాతి మీద తెలుగునాటి ఆడుబిడ్డా, కొండపక్కన అడవిలో వాగుపక్క బండరాళ్ళు.